క్లుప్తంగా

వత్తూరమ్మకు సామూహిక పొంగళ్లు


విశేషాలంకరణలో వత్తూరమ్మ

చిట్టమూరు: మండలంలోని నార్తు వరత్తూరు గ్రామ దేవత వత్తూరమ్మకు గ్రామస్తులు ఆదివారం సామూహికంగా పొంగళ్లు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు. 20 ఏళ్ల తర్వాత గ్రామస్తులంతా ఒకటై అమ్మవారికి జాతర చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయమానంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు. రాత్రి అమ్మవారికి విశేషాలంకరణ చేసి, బాణసంచా పేలుళ్లు, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు.

వాడవాడలా చెంగాళమ్మకు అంబళ్లు


శ్రీనగర్‌కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు

సూళ్లూరుపేట: పట్టణంలో వాడవాడలా చెంగాళమ్మకు అంబళ్లు పోసే కార్యక్రమం ఘనంగా జరుపుకుంటున్నారు. దీంతో సూళ్లూరుపేటలో అమ్మవారి తిరునాళ్ల సందడి ప్రారంభమైంది. ఆదివారం పట్టణంలోని శ్రీనగర్‌కాలనీ, సూళ్లూరు, సాయినగర్, గాండ్లవీధి, మహదేవయ్యనగర్, రాఘవయ్యపేట, కోళ్లమిట్ట, ఇసుకమిట్ట ప్రాంతాల్లో చెంగాళమ్మ తల్లికి ఇంటింటా పూజలు చేసి అంబళ్లు పోశారు. మహిళలంతా భక్తిశ్రద్ధలతో అంబళ్లు తీసుకుని తప్పెట్లు తాళాల నడుమ నాలుగురోడ్లు కూడళ్ల వరకు ఊరేగింపుగా వచ్చి అంబళ్లు పోసి, పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. గాండ్లవీధిలో జరిగిన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డీ బాల చంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఎడ్ల బండి కనుమరుగు


నేలపట్టులో నిరుపయోగం ఉన్న ఎడ్ల బండి

దొరవారిసత్రం: ఒకప్పుడు ప్రయాణమైనా... రవాణా అయినా.. ఎడ్ల బండే ఆధారం. అంతటి ప్రాధాన్యత కలిగిన ఎడ్ల బండ్లు నేడు ఎక్కడా కనిపించడంలేదు. గతంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా, ఆపద వచ్చినా ఎడ్ల బండిపై వెళ్లే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ట్రాక్టర్లు, ఆటోలు ప్రతి గ్రామంలో వీధికొకటి ఉండడంతో ఎడ్ల బండ్ల అవసరం ప్రజలకు, రైతులకు లేకుండా పోయింది. ఒక వేళ ఎక్కడైన ఎడ్ల బండ్లు గ్రామాల్లో ఉన్నా అవి మూలన పడి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఈతరం పిల్లలకి ఎడ్ల బండి ఎలా ఉంటుందో తెలియదు. కనీసం నేరుగా చూసే అవకాశం కూడా లేదు.

మలుపులు.. ప్రమాదాల నెలవులు


ముమ్మాయపాళెం వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

ఓజిలి: మండలంలోని పలు మార్గాల్లో మలుపు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా పట్టించుకునే వారు లేరని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదపరియ, చిలమానుచేను, ఆర్మేనిపాడు, వజ్జవారిపాళెం, ఇనుగుంట గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారుల్లో మలుపులు అధికంగా ఉన్నాయి. అలాగే ముమ్మాయపాళెం, మాచవరం, తిరుమలపూడి గ్రామాల రోడ్లలోనూ మలుపులు అధికంగా ఉన్నాయి. ఈ మలుపులు ఎల్,ఎస్ ఆకారంలో ఉండడంతో వాహన చోదకులు ఈ మలుపుల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారుల కిరువైపులా పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి, రోడ్లను కమ్మేస్తున్నాయి. ఈ క్రమంలో రాత్రి సమయాల్లో వాహన చోదకులు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్ల కిరువైపులా ఉన్న చెట్లు తొలగించి, మలుపులు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు మండల మీట్

దక్కిలి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ, హౌసింగ్, వ్యవసాయశాఖ తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యుడు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

బోధన..ఫలితాల్లో 'ఆదర్శం'

బోధన, ఫలితాల్లో నూతన ఒరవడి సృష్టిస్తున్నాయి ఆంధ్రప్రదేశ్ ఆదర్శపాఠశాలలు. ప్రతిభావంతులైన విద్యార్థులకు గీటురాయిగా మారాయి. అన్నింటిలోనూ ఆదర్శనీయంగా ఉండడంతో ఆదరణ పెరుగుతోంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ పాఠశాలలు వరంలా మారాయి. ఈ స్కూళ్లలో ప్రవేశాల గురించి తెలుసుకుందాం..

- ఆదర్శపాఠశాల సీట్లకు భలే డిమాండ్
- ప్రైవేటు, కార్పొరేట్‌లకు దీటుగా ఫలితాలు
- ఆరో తరగతి ప్రవేశాలకు 25తో ముగియనున్న గడువు
- జిల్లాలో పెరిగిన 100 సీట్లతో 500 మందికి అవకాశం



వెంకటగిరిలోని ఏపీ మోడల్ స్కూల్

వెంకటగిరి: అత్యున్నత విద్యాప్రమాణాలు, ఇంగ్లిషు మీడియం బోధన, మెరుగైన సౌకర్యాలతో జిల్లాలో వెంకటగిరి, తడ, దొరవారిసత్రం, కేవీబీపురం, ఎర్రావారిపాళెంలో ఉన్న ఏపీ మోడల్ స్కూళ్లు (ఆదర్శ పాఠశాలలు) విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బాలబాలికలకు ఆరో తరగతి నుంచి ఇంటర్ దాకా చదువుకునే అవకాశం ఉండడంతో ఏటా ఆ పాఠశాలల్లో సీట్లు కోసం పోటీ పెరుగుతోంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలన్న సంకల్పంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పాటైన ఆదర్శ పాఠశాలల్లో నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మరిన్ని సౌకర్యాలు కల్పించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను మోడల్ స్కూళ్లలో చేర్పేందుకు ఆసక్తి చూపుతున్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు, ఏడు నుంచి పదో తరగతి వరకు ఉన్న ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నారు. ఆరో తరగతిలో సీటు సాధిస్తే ఇంటర్ దాకా ఎటువంటి ఫీజులు లేకుండా ఇంగ్లిషు మీడియంలో విద్యను అభ్యసించవచ్చు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి విద్యార్థులను అన్నిరంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతారు.

సీట్ల పెంపుతో అదనంగా 100 మందికి అవకాశం

ఏటా ఆరో తరగతిలో ఒక్కో మోడల్ స్కూల్ లో 80 మందికి ప్రవేశాలు కల్పించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం వాటిని 100 సీట్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ విద్యాసంవత్సరం నుంచి ఒక్కొక్క పాఠశాలలో అదనంగా 20 మందికి అవకాశం ఉంది. దీంతో జిల్లాలో 5 మోడల్‌స్కూల్‌లలో 100 మంది బాలబాలికలకు అదనంగా అవకాశం లభించనుంది.

అర్హతలివే..

ఆరో తరగతి ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీలు 2011 సెప్టెంబర్ ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఏదైనా ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022–23 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి చదివి ప్రమోషన్ అర్హత పొందిఉండాలి. విద్యార్థులు ఈనెల 9వ తేదీ నుంచి 25వ తేదీలోగా నెట్‌బ్యాంకింగ్, క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డులను ఉపయోగించి పరీక్ష ఫీజు చెల్లించిన తర్వాత ఒక నంబర్ కేటాయిస్తారు. దాని ఆధారంగా ఆన్‌లైన్‌లో www.ere.ap.gov.in/apmr.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీలకు రూ 150, ఎస్సీ, ఎస్టీలకు రూ 75 పరీక్ష ఫీజు నిర్ణయించారు. దరఖాస్తు హార్డ్‌కాపీ, జత చేసిన ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఆయా ఆదర్శపాఠశాలల్లో అందజేయాలి.

రిజర్వేషన్‌లివీ..

ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 29 శాతం, దివ్యాంగులకు 3 శాతం, బాలికలకు 33 శాతం సీట్లు కేటాయించారు. నిర్దేశిత విభాగాల్లో అభ్యర్థులు లేకుంటే ఇతర గ్రూపుల నుంచి భర్తీ చేస్తారు.

ప్రవేశ పరీక్ష షెడ్యూల్

దరఖాస్తుల స్వీకరణ: మే 9వ తేదీ నుంచి 25వ తేదీ వరకు

ప్రవేశపరీక్ష	: జూన్11, 2023
పరీక్ష సమయం	: ఉదయం 10 గంటల నుంచి 12 వరకు
ఫలితాల ప్రకటన	: జూన్ 16, 2023
ఎంపికైన వారి జాబితా ప్రదర్శన	: జూన్ 18 2023
సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్	: జూన్ 19
తరగతుల నిర్వహణ	: జూన్ 21

సద్వినియోగం చేసుకోండి

మోడల్ స్కూల్‌లపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా వసతులు, సౌకర్యాలు కల్పిస్తోంది. కంప్యూటర్ విద్య, క్రీడలు, యోగా, కళలు, డిజిటల్ తరగతులతో నాణ్యమైన విద్యను అందిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నాం. గ్రామీణ విద్యార్థులకు ఇదో చక్కటి అవకాశం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.


డి తులసిజ్యోతి, ప్రిన్సిపల్, ఏపీ మోడల్‌స్కూల్, వెంకటగిరి

జగనన్నను మరో పదేళ్లు ఆదరించండి


నాయుడుపేట: బుక్‌లెట్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేట: సంక్షేమం అమలు చేశాం.. జగనన్నను మరో పదేళ్లు ఆదరించండని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గొట్టిప్రోలు పంచాయతీ మడఫలం గ్రామంలో ఆదివారం జరిగిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి పాల్గొన్నారు. స్థానికులు శాలువలు కప్పి, సత్కరించారు. ఎమ్మెల్యే కిలివేటి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ దళారీ వ్యవస్థకు స్వస్తి చెప్పి నేరుగా రైతులను రారాజులుగా చేసిన ప్రభుత్వం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దేనని చెప్పారు. అనంతరం మడఫలం గ్రామంలో రూ.9 లక్షలతో నిర్మించిన కల్వర్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ కురుగుండ్ల ధనలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, దేవారెడ్డి విజయులురెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, ఓట్టూరు కిషోర్‌యాదవ్, లింగారెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయానికి ఒక మంచి ఆస్తి

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయానికి సుమారు 25 ఎకరాల ఆస్తిని ఈ పాలకవర్గం సమకూర్చిపెట్టిందని, ఇది మంచి ఆస్తి అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు.


సూళ్లూరుపేట: మైదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

చెంగాళమ్మ తిరునాళ్ల నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన నూతన మైదానాన్ని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఆదివారం మధ్యాహ్నం లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ ఆలయానికి సమీపంలోని వాటంబేడురోడ్డులో సూళ్లూరు చెరువుకు పక్కన సుమారు ఐదు ఎకరాల స్థలం ఉందని గుర్తించి స్వాధీనం చేసుకున్నారన్నారు. పలువురు దాతలు కూడా స్థలం ఇవ్వడంతో ప్రస్తుతం సుమారు 20 ఎకరాలకు పైగా స్థలం ఆలయానికి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, ఆలయ పాలకమండలి సభ్యులు కర్లపూడి సురేష్‌బాబు, బండి సునీత, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణ, కదూరు లక్ష్మి, పేర్నాటి లక్ష్మీదేవి, ఉమ్మటి రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఎవరూ దోచుకోలేని సంపద విద్య


విద్యార్థినికి ప్రోత్సాహకం అందజేస్తున్న బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ప్రతినిధులు

గూడూరు: ఎవరూ దోచుకోలేని సంపద విద్య మాత్రమేనని, మనిషి ఎదుగుదలకు అది ఎంతో ముఖ్యమని, దాంతోనే అనేక మంది ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారని బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం గూడూరు శాఖ ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని మినీ బైపాస్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బలిజ విద్యార్థినీ విద్యార్థులకు సంఘం సభ్యులు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నతంగా ఎదిగేందుకు విద్య ఒక్కటే మార్గమని, చిన్నతనం నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు కష్టపడి చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ విశ్రాంత డీఈ అనిల్‌కుమార్, నాయకులు మదనమేటి వెంకటరమణయ్య, చదలవాడ హరిబాబు, శీలం కిరణ్‌కుమార్, మల్లికార్జున్, సారంగం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో సాయికృష్ణయాచేంద్ర తదితరులు

వెంకటగిరి: అన్నివర్గాల ప్రజలు వెంకటగిరిలో స్థిర నివాసం ఏర్పరుచుకోవాలనే విధంగా పట్టణాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా వెంకటగిరి ప్రముఖులతో కలిసి కృషి చేస్తామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం భవనంలో ఆదివారం ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్రతో కలిసి (ఆర్‌ఆర్‌ఆర్ యూనిట్) రెడ్యూస్, రీయూస్, రీసైక్లింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికుల వద్ద నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్, దుస్తులు, ప్లాస్టిక్ వస్తువులు, ఇనుము తదితర సామగ్రిని సేకరించి వాటిని రీసైక్లింగ్ చేసి, మళ్లీ అవసరం అయిన వారికి చేర్చుతారని తెలిపారు. ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ వెంకటగిరిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు ధనియాల రాధమ్మ, మైనారిటీ విభాగం నాయకుడు యస్దానీబాషా, న్యాయవాది ఎల్ కోటీశ్వరరావు పాల్గొన్నారు.

పూసలకు నేదురుమల్లి పరామర్శ

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని అంబలపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పూసల పుల్లయ్యనాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పుల్లయ్య నివాసం వద్దకు చేరుకుని పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి, నాయకులు ముని వెంకటేశ్వర్లు, జనార్దన్‌నాయుడు, మల్లెల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నేడు,రేపు గడప గడపకు మన ప్రభుత్వం

రాపూరు: మండలంలో సోమ,మంగళవారాల్లో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరగ మురళీధర్ పాల్గొంటారని జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రాపూరులోని మసీదుపేట, ఇందిరాకాలనీ, మద్దెలమడుగులో నిర్వహిస్తారన్నారు. మంగళవారం రామిరెడ్డిపల్లె, నవాబుపేటలో పర్యటిస్తారని తెలిపారు.

కండలేరులో 32.551 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 32.551 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,450 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు180, హైలెవల్ స్లూయిస్‌కు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆశాజనకంగా ఖరీఫ్ సాగు

కోట: మండలంలో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉందని ఏఓ నిరంజన్‌కుమార్ తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు ఆదివారం గూడలిలో ఖరీఫ్ సాగును పరిశీలించి, రైతులకు తగిన సూచనలిచ్చారు. ఏఓ మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది చెరువుల్లో నీరు పుష్కలంగా ఉందన్నారు. ఈ ఏడాది 3,500 ఎకరాల్లో ఖరీఫ్‌సాగు ఉందన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పంటసాగులో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేస్తున్నామన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు సమయంలో విధిగా బిల్లు తీసుకోవాలన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్


కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు


రోడ్డు మార్జిన్ నుంచి విడిపోయిన తూము

చిట్టమూరు: సూళ్లూరుపేట–కోట రహదారిలో చిట్టమూరు మండలంలోని తాడిమేడు చెరువుకట్ట వద్ద తారురోడ్డు మార్జిన్ ప్రమాదకరంగా మారింది. చెరువులో నుంచి సాగు నీరు పొలాలకు వచ్చేందుకు ఆర్‌అండ్‌బీ రోడ్డు కింద తూములు ఏర్పాటు చేశారు. వీటి వద్ద రోడ్డు కోతకు గురై, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని వాహన చోదకులు చెబుతున్నారు. రోడ్డు మార్జిన్ దిగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రోడ్డు మార్జిన్ కింద లోయలా ఉండడంతో వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మొదట హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రాణహాని ఉందని సర్పంచ్ భర్త ఫిర్యాదు

ఓజిలి: కొంతకాలంగా కొందరు వ్యక్తులు తన ఇంటి వద్దకు వచ్చి దౌర్జన్యం చేస్తూ చంపుతామని బెదిరిస్తున్నట్లు సర్పంచ్ పిండూరు మౌనికారెడ్డి భర్త పిండుకూరు మధుసూదన్‌రెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుడి కథనం మేరకు.. మాచవరం ఎస్సీ కాలనీకి చెందిన కొంత మంది వ్యక్తులు శనివారం ఉదయం ఇంటి వద్ద ఉన్న బులెట్‌ను తాను ఇంట్లో లేని సమయంలో తన అనుమతి లేకుండా చోరీ చేశారు.

ఈ విషయాన్ని చుట్టుపక్కల వారు ఆయనకు సమాచారం అందించారు. సర్పంచ్ భర్త తన బైక్ ఎందుకు తీసుకెళ్లావని ఫోన్‌లో ప్రశ్నించగా కొత్త సినిమా రిలీజ్ ఉంది.. వెళ్లివస్తామని చెప్పారు. తర్వాత కొంతసమయానికి బైక్ ఇంటి వద్ద పెట్టి వెళ్లిపోయారు. అనంతరం నెల్లూరు నుంచి ఇంటికి చేరుకుని గ్రామంలో ఏమి జరిగిందో తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీకి చెందిన కొంతమంది మధ్యాహ్నం సర్పంచ్ భర్త ఇంట్లోకి ప్రవేశించి ఆయనపై దాడికి పాల్పడారు. ఇంట్లోకి ఎందుకు వచ్చారని ఆయన ప్రశ్నించగా మద్యం మత్తులో దుర్భాలాడారు. ఎందుకు తన భర్తను తిడుతున్నారని సర్పంచ్ అడ్డుకోగా ఆమెను కూడా దుర్భాషలాడి, చంపుతామని బెదిరించారు. వారితో తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు తనకు ప్రాణరక్షణ కల్పించాలని కోరారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ దారం ఆదిలక్ష్మి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

వెంచర్ వేడుకల్లో రికార్డు డ్యాన్సులు

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడులో నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్ ప్రారంభోత్సవంలో ఆదివారం రాత్రి అనుమతులు లేకుండా రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించారు. దీంతో నాయుడుపేట సీఐ సోమయ్య తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు గ్రామంలోని సిద్దేశ్వరకొండ దిగువ ప్రాంతంలో సుమారు 75 ఎకరాల్లో ఎస్‌ఎల్‌ఎస్ డెవలపర్స్ ఆధ్వర్యంలో సాగరమాల టౌన్‌షిప్ పేరుతో లేఅవుట్ ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ ప్రారంభోత్సవం సందర్భంగా మందు, విందుతో పాటు రికార్డింగ్ డ్యాన్సులు ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న సీఐ సోమయ్య, ఇన్‌చార్జి ఎస్‌ఐ తిరుమలరావు తమ సిబ్బందితో కలిసి రికార్డింగ్ డ్యాన్సులపై దాడులు చేశారు. ఈ దాడుల్లో ఐదుగురు వెంచర్ నిర్వాహకులతో పాటు ఆరుగురు డ్యాన్సర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


శిరసనంబేడులో నిర్వహిస్తున్న రికార్డింగ్ డ్యాన్సులు

పల్లెకు మొబైల్ వ్యాపారం


దొరవారిసత్రంలో చెరుకు రసం అమ్ముతున్న వ్యాపారి

దొరవారిసత్రం: పల్లెల్లో సాధారణంగా చెరుకు గానుగల వద్దకు వెళ్లి చెరుకు రసం తీసుకుని తాగుతుంటారు గ్రామీణులు. అయితే కాలం మారింది మైనరూ అన్న చందంగా నేడు చెరుకు సాగూ తగ్గింది.. గానుగలు ఆడే వారే కరువయ్యారు. ఈ క్రమంలో బయట రాష్ట్రాల నుంచి జీవనోపాధి కోసం ఇక్కడకు విచ్చేసిన పలువురు చిరు వ్యాపారులు పల్లెబాట పట్టి చెరుకు రసం అమ్మకాలు జోరుగా సాగిస్తున్నారు. రాజస్థాన్, బీహార్ రాష్ట్రాలకు చెందిన కొన్ని కుటుంబాలు వారు చెరుకు రసం బండ్లుతో సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణ ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని నివాసం ఉంటూ గ్రామాల్లో బండ్లలో వెళ్లి చెరుకు రసం అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు. ఎండలు మండిపోతున్న దంతో గ్రామాల్లోనూ జనం వేసవి తాపం తీర్చుకోవడానికి చల్లగా చెరుకు రసం తాగేస్తున్నారు.

నూతన కమిటీ


నూతన కమిటీ సభ్యులు

నాయుడుపేట: స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఈసీఈఏ జీ 3045) నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వై పద్మనాభయ్య అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికలో కమిటీ సభ్యులుగా కె తులసీ ప్రసాద్, ఎన్ ఏకాంబరం, సురేష్, కె వెంకటేష్, జీ సుబ్రమణ్యం, ఎస్ ప్రహ్లాద, తాతారావు, ఎస్‌కె మహ్మద్ హుస్సేన్, ప్రకాష్ ఎన్నికయ్యారు.


విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ దాడులు


మాట్లాడుతున్న విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ అధికారులు శనివారం అర్ధరాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో దాడులు చేశారు. జిల్లా ఎస్‌ఈ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామని విజిలెన్స్ జిల్లా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో ఉన్న తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని చిట్టమూరు మండలం ఆరూరు, ఈశ్వరవాక, రాఘవవారిపాళెం పరిసర ప్రాంతాల్లో రొయ్యల గుంటల వద్ద ఆకస్మిక తనిఖీలు చేశామన్నారు. యజమానులు మీటర్‌ను బైపాస్ చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుండడాన్ని గుర్తించినట్లు తెలిపారు. దీంతో సంబంధిత గుంటల యజమానులైన ఈగల చిరంజీవి, నాగముంత సుబ్బయ్య, మల్లి వెంకటాచలంపై కేసులు నమోదు చేసి రూ.5,37,035 నగదును జరిమానా విధించామని వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించి విద్యుత్ సంస్థకు నష్టం కలిగిస్తే సహించేది లేదన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారు ఎంతటి వారైనా కేసులు నమోదు చేసి అధిక మొత్తంలో జరిమానా విధించడంతోపాటు, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో విద్యుత్ శాఖ కోట అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వరప్రసాద్‌రెడ్డి, డీపీఈ జగదీష్, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్, ఎస్సై సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవనదిలా కైవల్యా

సైదాపురం: మండలంలోని కైవల్యానది నాలుగేళ్లుగా ఏడాది పొడవునా ప్రవహిస్తోంది. మే నెలలో కూడా కైవల్యా నదిలో నీరు ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రాంతాలకు చెందిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని రైతులు తమ పొలాల్లో వివిధ పంటలను సాగు చేసుకుంటున్నారు.


వేసవిలోనూ ప్రవహిస్తున్న కైవల్యానది